


కుళాయిలోంచి పడుతున్న ధార సన్నగా ఉంది - రోజు రోజుకూ చిక్కిపోతున్న సత్యవతి లాగే. సుడిగుండంలో చిక్కుకున్న చీమలా సత్యవతి గుండె గుబులు పడుతోంది. 'ఎందుకిలా అయింది? అదే గనుక జరిగితే ఏం చేయాలి? తాము జనానికి ముఖం చూపించగలమా? అలా అని పాపానికి ఒడిగట్టగలమా?'

తేనె చప్పరించాల్సిన వేళ తేలు కుట్టినట్టు సత్యవతిని కొన్ని రోజులుగా ఓ అనుమానం పీడిస్తోంది. బిందెనిండాక చంకనెత్తుకుని రోడ్డు దాటి తమ పాక హోటల్లోకి వెళ్లింది సత్యవతి.

అల్యూమినియం బేసిన్లో మైసూరు బజ్జీలు సర్దుతున్న రాయుడు "ఇంతాలస్యమైందేమే - అవతల స్వాములు వచ్చే వేళయింది?" అన్నాడు.

"అసలే నీటి కరువు. పైగా పంపులు కట్టేసే టైమైంది" జవాబిస్తూ వంట మొదలుపెట్టింది సత్యవతి.

ఎసరు మరిగింది. అడించే వాడి బెత్తానికి జడిసి గెంతే కోతి పిల్లల్లా - మెతుకులు గిన్నెలో మట్టానికి పోతూ మళ్లీ పైకి వస్తున్నాయి. 'తాను పుట్టి బుద్దెరిగాక ఎవరికీ అపకారం తలపెట్ట లేదు. ఆ దేవుడు ఎందుకిలా తమతో చెలగాట మాడుతున్నాడో?" సత్యవతిలో గుబులు తిరిగి రేగింది.

ఇందాక కుళాయి దగ్గరున్నప్పుడు నీళ్లు పట్టుకోవడానికి వచ్చిన పట్టు పరికిణీ పిల్ల గుర్తు కొచ్చింది. చిన్నప్పుడు తాను అంతకన్నా కళగా ఉండేది. ఒక్కగానొక్క కూతురని అమ్మ ఎంత అబ్బడం చేసేది? పూటకో రకంగా జడ వేసి, పూలు పెట్టి ముస్తాబుచేసి మురిసిపో యేది. రాత్రయ్యే సరికి దిష్టి తీసేది. పెద్దదైన మరుసటి ఏడే తమ నాలుగెకరాల మాగాణిలో రెండెకరాలు కట్నంగా ఇచ్చి పెళ్లి చేశారు.

ఎర్రగా, మంచి ఒడ్డూ పొడుగుతో - పెళ్లి కాని ఆడపిల్లల కలల్లోకొచ్చేలా ఉండేవాడు రాయుడు. పదెకరాల మాగాణికి ఒక్కడే వారసుడు. కట్నం మరింత ఇవ్వాల్సి వచ్చేదే గానీ - సత్యవతి అందానికి రాయితీగా రాయుడు కుటుంబం కట్నాన్ని తగ్గించింది.

కన్నెపిల్లల కలల వీరుడికి ముందు ముందు కూడా బతుకు బాధ్యతలు బొత్తిగా వంటబట్ట వని సత్యవతి తల్లిదండ్రులు తెలుసుకోలేక పోయారు. 'కుర్రోడికి కాస్త సరదాలు ఎక్కువ. పెళ్లయితే బరువు బాధ్యతలు అవే తెలిసొస్తాయి' అనుకున్న వారి అంచనా తప్పయింది.

పని చేయడానికే కాదు... కనీసం పొలం వెళ్లి చేలు చూసుకోవడానికీ ఆసక్తి, తీరికా లేని రాయుడు తల్లిదండ్రులు బతికుండగానే సగం ఎకరాలను పట్నంలోని క్లబ్బులకూ, బార్లకూ జమ చేసేశాడు. తల్లిదండ్రులు కాలం చేసాక కొద్దికాలానికే ఆ మిగిలిన పొలానికే కాక సత్యవతి తెచ్చుకున్న రెండెకరాలకూ కాళ్లొచ్చేశాయి. స్థిరాస్తి దఫదఫాలుగా హారతి కర్పూరంలా ఆవిరైపోతున్నా ఎన్నడూ సత్యవతి హెచ్చరిక

**యు. సూర్యచంద్రరావు**

లనూ, మొత్తుకోళ్లనూ ఖాతరుచేయని రాయుడు ఇల్లు కూడా అమ్మి రోడ్డున పడ్డాక గానీ కలల్లోంచి బయట పడలేదు.

కళ్లెదుట ఆస్తి లేని బతుకు భయపెట్టింది. బెంబేలెత్తి మందుకు బదులు పురుగుమందు తాగాడు.

మెడలో మిగిలిన పుస్తెలు అమ్మి బొట్టు దక్కించుకుంది సత్యవతి. రాయుడికెన్ని దురలవాట్లున్నా ఆస్తిని విచ్చలవిడిగా తగలేసినా, సత్యవతి హితబోధలను ఖాతరు చేయకపోయినా, ఆమె అంటే మక్కువ. అదే ఆమె బతుకులో సన్నని మెరుపు. కళ్లు చెదిరే సత్యవతి సొగసే రాయుడి మక్కువకు కారణం కావచ్చు.

బేలగా మారిన రాయుడికి సత్యవతి ధైర్యం చెప్పింది. 'తాతల నేతుల' మాట మరిచి నిజాన్ని జీర్ణించుకోక తప్పదంది. ఎదురీతలో తానే ముందుండి కాఫీ హోటల్ తెరిపించింది.

ఆ హోటల్ కూడా అంతంత మాత్రంగా నడవడంతో కష్టాలు తరుముతూనే వచ్చాయి. అదే సెంటర్‌లో మరో రెండు పాక హోటళ్లు వెలసాయి. అర కిలో పప్పుతో చేసిన ఇడ్లీలే సాయంత్రానికి కూడా పళ్లెంలోనే పడి ఉండి వెక్కిరించేవి. టీ, కాఫీలకని లీటరు పాలే తీసుకున్నా రాత్రికి తోడుపెట్టాల్సి వచ్చేది.

తడిసిన కట్టెలతో పొయ్యి రాజేసినట్టు బతుకు పొగచూరుతూనే ఉంది. కరెంటు బిల్లేకాదు – నెలనెలా కట్టాల్సిన హోటల్ పాక అద్దె కూడా చెల్లించలేకపోయేవారు. చీకట్లో పాము బుసలా – బతుకు గడవడానికేమి చేయాలో తోచని అయోమయం ఎదురైంది.

ఈ సమయంలోనే వారికి అయ్యప్ప భక్తుల రూపంలో ఆధారం దొరికింది. ఆ ఊళ్లో అయ్యప్ప భక్తుల సంఖ్య ఎక్కువ. మాలధారణ చేసే సీజన్‌లో వారికి అవసరమైన నియమ నిష్టలతో, విధి, నిషేధాలకు అనుగుణంగా అల్పాహారాన్ని, భోజనాన్నీ తయారుచేసే బేరం దొరికింది. దానితో ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లలో నాలుగు రాళ్లు కళ్లజూడగలుగుతున్నారు. మూడేళ్లుగా – ఆ మూడు నెలల రాబడితోనే ఏడాదంతా బతుకు బండిని కుదుపుల్లేకుండా నెట్టుకురాగలుగుతున్నారు.

* * *

"స్వాములు వచ్చేస్తున్నారు. ప్రసాదం సిద్ధమైందా?" రాయుడు హెచ్చరించాడు.

"వార్చేస్తున్నాను... మరో అయిదు నిమిషాల్లో వడ్డించేస్తాను" అంటూ రాయుడి వంక చూసిన సత్యవతి కళ్లు చెమ్మగిల్లాయి.

ఒకనాటి కలల వీరుడు నలభై ఏళ్లు దాటీ దాటగానే తాతయ్యలా మారిపోయాడు. ముందు పళ్లలో పైనొకటీ, కిందొకటీ రాలిపోయాయి. దువ్వెన దిగని ఉంగరాల జుట్టు మాడు కనిపించేలా పలచబడింది. గాలి పోయిన బుడగల్లా కండరాలు వడిలిపోయాయి.

తానూ అంతే – 'నా బంగారపు బొమ్మ' అంటూ అమ్మ రోజుకు ఎన్నిసార్లు బుగ్గలు పుణికేదో! ఇప్పుడో – ఆ వన్నే, కళా చిన్నమెత్తు మిగలకపోగా కిలుంపట్టిన ఇత్తడి కళాయిలా మారిపోయింది. నీడ చూసుకోవచ్చన్న బుగ్గలు నడి వేసవిలో నీటి గుంటల్లా లోతుకు పోయాయి. మోకాళ్లు దాటే సిరిజుట్టు వేలి ముడికి చాలనంత కురచైపోయింది. ఊరి మగవాళ్లను ఊరించి లొట్టలు వేయించిన అందం సొట్టలు పడ్డ సత్తు గిన్నెలా మిగిలింది.

ఏ లోపమో, ఏ పాపమో తన కడుపే పండలేదు. రాయుడు తన సరసన చేరి లాలించి

మురిపించే ప్రతిసారీ ఆ లాలనకు ప్రతిరూపం తన కడుపున పడడం లేదేనన్న బాధ కలుక్కుమనేది. తరవాత్తర్వాత 'చెట్టుకే నీరు చాలనప్పుడు కాయ కాసినా గిడసకాపే తప్ప ఏపుగా పెరుగుతుందా? ఈ దరిద్రపు బతుకులో పిల్లలు లేకపోవడమే మేలైంది - పుట్టి వాళ్లూ తమతో పాటు దరిద్రం అనుభవించే కన్నా' అనుకుని సమాధానపడేది.

సత్యవతిలో మళ్లీ గుబులు రాజుకుంది. 'అయ్యో! దేవుడా! మమ్మల్ని ఏం చేయబోతున్నావు? ఈ బతుకూ బతకనియ్యవా?' అని ఆక్రోశించింది.

* * *

"సత్యవతి మాత చేతి వంటకి సాటి లేదు. ఆ నలభీములైనా మాత ముందు బలాదూరే" ఆకుల్లో పిసరు కూడా మిగల్చని అయ్యప్ప స్వాములు తృప్తిగా త్రేన్చుతూ కితాబిచ్చారు.

చిట్లం కట్టిన మతాబు కాలి కాలి ఒక్క



సారిగా పువ్వులు రాల్చినట్టు రాయుడి ముఖం వెలిగిపోయింది.

పలుగులతో పొడుస్తున్నట్టు తలలో నొప్పి చెలరేగుతున్న వేళ కురుల అందాన్ని పొగిడినట్టు గుబులు పడుతున్న సత్యవతి స్వాముల మెచ్చుకోలుతో ముఖంలోకి పాలిపోయిన నవ్వును మాత్రమే తెచ్చుకోగలిగింది.

* * *

ఆ రాత్రి తడికె వేసి హోటల్ మూసివేసాక సత్యవతి తన గుబులును రాయుడితో చెప్పుకుంది.

రాయుడు పడిపడి నవ్వాడు. రాజకీయ నాయకులంతా వాగ్దానాలకు కట్టుబడిపోతున్నారన్న నమ్మరాని కబురేదో చెప్పినట్టు ఫక్కున నవ్వాడు. పేకాటలో అవతలి వాడు షో చేసినా తాను షో చేయడానికి కావలసిన ముక్క కోసం దస్తీలో ఆత్రంగా తడుముకునే ఆశ చావని జూదగాడిని చూసినట్టు విరగబడి నవ్వాడు. నవ్వీ నవ్వీ కళ్ల వెంట నీళ్లు రాగా సత్యవతి తల నిమురుతూ "మనకా యోగమూ, ప్రమాదమూ – రెండూ లేవు లేవే... నువ్వేం బెంబేలు పడకు" అన్నాడు.

అన్నాడే గానీ రాయుడికీ గుండె బరువెక్కింది. సత్యవతిని వాటేసుకుని సన్నగా రోదించాడు. రాయుడి తలను రొమ్ముకు హత్తుకుని వెక్కెక్కిపడింది సత్యవతి.

* * *

మర్నాటి ఇడ్లీలకని పప్పు రుబ్బుతున్న సత్యవతికి కడుపులో వికారంగా అనిపించింది. కొంతసేపు తమాయించుకోగలిగినా చివరకు తోసుకు వచ్చింది. రోట్లోనే వాంతి చేసుకుంది. అన్నం కంచంలో పడ్డ ఎర్రబల్లిలా మల్లెపువ్వుల పోగులాంటి పిండి మీద వాంతి పరుచుకుంది.

'హోరి దేవుడా! తన అనుమానం నిజమవుతోందా?" కుమ్మరి పురుగులా సత్యవతిని తొలుస్తూ వచ్చిన గుబులు కొండచిలువగా మారింది.

సంగతి తెలిసిన రాయుడు "చేయగలిగిందేముంది – ఏదైతే అదే అవుతుందిలే. నువ్వేం నలిగిపోకు" అంటూ అనునయించాడు.


ఆ రాత్రంతా నిప్పుల మీద పడుకున్నట్టు గడిచింది.

మర్నాడు ఉదయం బేరం చూసుకున్నాక రాయుడిని వెంట బెట్టుకుని బితుకు బితుకుమంటూ గవర్నమెంట్ హాస్పిటల్‌కెళ్లింది.

పరీక్షించిన డాక్టరమ్మ చెప్పింది... సత్యవతికి 'మాత'యోగం పట్టబోతోంది!

మీరు ఎవరి మొబైల్‌కైనా కాల్ చేసినప్పుడు అది ఎంగేజ్‌లో వున్నా, ఆన్సర్ చేయకపోయినా, రిజెక్ట్ చేయబడినా తగినంత సమయం వేచిఉండి, ఆ తర్వాతనే మళ్లీ ప్రయత్నించండి. సాధారణంగా ఇటువంటి సందర్భాలలో వారు మీకు తిరిగి కాల్‌చేసే అవకాశం ఉంది. దానికి తగినంత సమయం వారికివ్వాలి. అంతేగానీ సెకన్ల వ్యవధిలో మళ్లీ మళ్లీ ప్రయత్నించకూడదు. ఫోన్ ఎంగేజ్‌లో ఉన్నప్పటికీ చాలా సందర్భాలలో వారికి మీ ఫోన్ నుంచి మిస్డ్‌కాల్ కన్పిస్తుంది. (కాల్ వెయిటింగ్ సౌకర్యం వల్ల).

అందుచేత తగినంత సమయం వేచి ఉండండి. అంతేకాదు – మరో ముఖ్య విషయం – మీ ఫోన్‌లో మిస్డ్‌కాల్ కన్పిస్తే తప్పనిసరిగా ఆ నంబర్‌కి తిరిగి కాల్ చేయడం అనేది మంచి అలవాటు. (కావాలని మిస్డ్ కాల్ ఇచ్చి, కట్ చేసేవారికి తిరిగి కాల్ చేయడం మాత్రం మీ ఇష్టం).




స్వాములకు వండిపెట్టే 'మాత' యోగాన్ని మూడేళ్ల కిందటే దక్కించుకున్న సత్యవతికి ప్రస్తుతం మూడో నెల!

కబురు విన్న దంపతుల గుండెల్లో కలవరం - గడ్డ కట్టించే చలి వేకువన చలిమంటలోకే తూలిపడడం లాంటి కలవరం. కలలోనూ తరుముతున్న పులి లాంటి దరిద్రాన్ని కాచుకునేందుకు- ప్రత్యక్షంగా ఎవరికీ అపకారం కాని అబద్ధాన్ని చెప్పినా తప్పు లేదనుకున్నారు. 'దీనుల కాపాడుటకు దేవుడో, ప్రభువులో' దిగివచ్చిన దాఖలాలు లేవన్న లోకజ్ఞానంతోనే తమకు తోచిన ఉపాయాన్ని అనుసరించారు. 'ఇన్నాళ్లూ లేనిది ఇక ఈ వయసులో మనకా శక్తీ లేదు. యోగమూ లేదు' అన్న ధీమాతోనే ఆ దారి తొక్కే ధైర్యం చేసారు. బతుకుతెరువును నిలబెట్టుకోవాలి. స్వాములకు వండి పెట్టే బేరం గిట్టుబాటవుతుం'దన్న ఆశతో మూడేళ్ల క్రితం ఆ దంపతులు చెప్పిన అబద్ధాన్ని ప్రకృతి వెక్కిరించింది.

సత్యవతికి నెలసరులు ఆగిపోయాయన్న రాయుడి మాటలతోనే స్వాములు వారి హోటల్లో 'ప్రసాదం' స్వీకరించనారంభించారు. హోటల్ నిలబడింది.

'డాక్టరమ్మ చెప్పిన కబురు తమ బతుకుల్లో తాత్కాలికంగా వెలుగు నింపే మెరుపా, ఉన్న బతుకునూ ధ్వంసం చేసే పిడుగా?

పరువుకూ, బతుకు తెరువుకూ ముప్పు తెచ్చినా - మోడు జీవితాన్ని మురిపించేదాన్నా, మెతుకుకు భరోసానిస్తున్నదాన్నా - ఏ 'మాత' యోగాన్ని నిలబెట్టుకోవాలి? దేన్ని పోగొట్టుకోవాలి?'

సుడిగాలికి ఎగిరి నట్టడవిలో పడ్డ కబోదుల్లా, మత్తు ఇవ్వకుండానే గుండె ఆపరేషన్ జరిగిన రోగుల్లా హాస్పిటల్ వరండాలోని బల్ల మీదే కూలబడ్డారు సత్యవతీ, రాయుడూ.

ఎదురుగా గోడ మీద - బోసి నవ్వులు చిందించే పసిబిడ్డ ఫొటోతో ఉన్న 'స్త్రీ శిశు సంక్షేమ' పోస్టర్‌పై చిక్కటి సాలెగూడు! ●